క్లుప్తంగా

ప్రజలందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు

వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వండవలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, క్రైస్తవులు క్రిస్మస్ పండగను సుఖ, సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కీర్తన ఫౌండేషన్ వితరణ

పాలకొండ రూరల్: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కీర్తన ఫౌండేషన్ ప్రతినిధులు బత్తిన మోహనరావు, లక్ష్మి దంపతులు పేదలకు అన్నదానం, వస్త్రదానం చేపట్టారు. ఆదివారం స్థానిక ఫౌండేషన్ కార్యాలయం వద్ద సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలు వినిపించారు.

నేడు రహదారి పనులకు శంకుస్థాపన

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి నుంచి పిప్పలభద్ర వరకు తారురోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి సోమవారం శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల్‌కత్తా నగరంలో జరిగిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొన్న పార్వతీపురం ప్రాంతానికి చెందిన బూరి గణేష్ 21–22 కేజీల విభాగంలో బంగారు పతకం, 45–48 కేజీల విభాగంలో తెంటు హేమంత్, 63–65 కేజీల విభాగంలో రజత పతకాలు సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు. తన వంతు ప్రోత్సాహం, సహాయ సహకారాలు క్రీడాకారులకు ఎల్లప్పుడూ ఉంటాయని చెబుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి మన ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సభ్యులు సువ్వాడ లావణ్య, సచివాలయం కన్వీనర్ ఎస్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా


ఆడుదాం ఆంధ్రా ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ

సాలూరు: యువతలో దాడి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారి ప్రతిభను చాటిచెప్పే ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్‌చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అన్నారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ఆమె ఆడుదాం ఆంధ్రా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువత క్రీడల్లో రాణించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించవచ్చన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఆవశ్యకతపై ప్రజలకు ముఖ్యంగా యువతకు అవగాహన పెంపొందించాలని పిలుపునిచ్చారు. నాణ్యమైన క్రీడాసామగ్రి ఇప్పటికే క్షేత్రస్థాయికి చేరుకుందని, అత్యంతపారదర్శకంగా ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు.

కాటాలకు సీల్ వేయించాలి

సీతానగరం: మండలంలోని వర్తకులు వినియోగిస్తున్న తూనిక యంత్రాలకు విధిగా ప్రభుత్వ సీల్ వేయించుకోవాలని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ రతన్‌రాజు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డిపో డీలర్లకు సంబంధించిన తూనిక యంత్రాలకు సిబ్బందితో సీల్ వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వర్తకులు ఉన్నత ప్రమాణాలకు లోబడిన యంత్రాలను వినియోగించాలని సూచించారు. వర్తకులు,సరుకుల కొనుగోలుదారులు యంత్రాలకు ప్రభుత్వ అనుమతులు పొందడానికి సీల్ వేయించాలని లేనిపక్షంలో అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వినియోగదారులకు సక్రమంగా తూకం వేసి సరుకులు విక్రయించాలని సూచించారు. మండలంలో ధాన్యం తూకం యంత్రాల్లో లోపాలున్నాయని రైతులనుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కొనుగోలు దారులు కాటాలను సరిచేసుకోవాలని పిలుపునిచ్చారు.

సేవే క్రీస్తు మార్గం..


పాలకొండ రూరల్: చరిత్రకు నిదర్శనంగా నిలుస్తున్న లూర్థుమాత ఆలయం


పాలకొండ రూరల్: క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన స్థానిక షారోను ప్రార్థనా మందిరం


గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురంలో విద్యుత్ అలంకరణతో ముస్తాబయిన శిలువగిరి ప్రార్థన మందిరం


పాలకొండ రూరల్: లుంబూరు రహదారిలో ఏర్పాటు చేసిన కరుణామయుని జన్మవృత్తాంతం తెలిపే పశువుల పాక


భామిని: మండల కేంద్రలో వేడుకలకు సిద్ధమైన చర్చి


భామిని: నిర్మలా కాలనీ సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎస్సై ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు అన్నాజీరావు, ఫాదర్ తామస్ రెడ్డి


వీరఘట్టం: రెల్లివీధి వద్ద వేళాంగిణీ మాత చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఏసుక్రీస్తు జన్మించిన గొర్రెలపాక

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లోని చర్చిలు అందంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి. సేవే క్రీస్తు తత్వమని.. ప్రేమే ఏసు మార్గమని ప్రబోధకులు ప్రవచిస్తున్నారు. మత పెద్దల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. ఇప్పటికే క్రైస్తవ సోదరులు సెమీ క్రిస్మస్ వేడుకలు సంబరంగా జరుపుకున్నారు. పాలకొండలోని ఆర్‌సీఎం లూర్థుమాత ప్రార్థనా మందిరం, మండంలోని అన్నవరం, గోపాలపురం, చిన్న మంగళాపురం, వెలగాడ, తదితర గ్రామాల్లోని చర్చిలతో పాటు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని శిలువ గిరి ప్రార్థనా మందిరం, ఎస్‌కే పాడు గ్రామంలోని పునీత రాయప్ప దేవాలయం, తదితర చర్చిలు సంబరాలకు సిద్ధమయ్యాయి.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్


వీరఘట్టం: విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబైన వీరఘట్టం సీబీఎం చర్చి

విలువల్లేని వ్యక్తి చంద్రబాబు

- నాడు పీకేను బీహారీ బందిపోటు అన్నాడు
- నేడు పీకే చుట్టూ తిరుగుతున్నాడు ..
- ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: రాష్ట్రంలో విలువల్లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారా అంటే ఠక్కున చెప్పే మొదటి పేరు చంద్రబాబునాయడుదేనని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ, 2019 ఎన్నికల సమయంలో రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ను బీహారీ బందిపోటు అని దుయ్యబట్టిన చంద్రబాబునాయుడు నేడు అదే ప్రశాంత్ కిషోర్‌తో రాజకీయ మంతనాలు చేస్తుండడం సిగ్గుచేటన్నారు. అవసరమైతే గాడిద కాళ్లైనా చంద్రబాబు నాయుడు పట్టుకుంటారని ఎద్దేవా చేశారు. ఎటువంటి విలువల్లేని చంద్రబాబును రాష్ట్ర ప్రజలు విశ్వశించడం లేదన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏ శుభ ముహూర్తాన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారో కాని అప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. దీంతో రోజు రోజుకీ ప్రజల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై నమ్మకం పెరుగతోందన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని పలు సర్వే రిపోర్టులు స్పష్టం చేస్తుండడంతో చంద్రబాబుకు నిద్ర పట్టడం లేదన్నారు. ఎలాగైనా అధికారం చేట్టాలనే ఉద్దేశంతో జనసేనతో జత కట్టారన్నారు. ప్రజల ఆశీస్సులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపైనే ఉన్నాయని, మేము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే మరోసారి మమ్మల్ని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

- సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

పాలకొండ రూరల్:

సత్యసాయి సేవా సమితుల ద్వారా జిల్లాలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని సత్యసాయి మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు సమితి సభ్యులు ప్రతి ఒక్కరూ కనీసం ఏడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అవసరమైతే తామే మొక్కలు అందిస్తామన్నారు. వీరఘట్టం మండలం చిట్టిపూడివలస మందిరాన్ని సత్యసాయి సామాజిక మందిరంగా రూపాందిస్తామని చెప్పారు. అనంతరం బాబా జయంతి వేడుకల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు నేతాజీ, ఐటీ విభాగం రాష్ట్ర నిర్వాహకుడు ఆర్.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


సేవా సమితి పుస్తకాలను అవిష్కరిస్తున్న సేవా సమితుల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు

జనవరి చివరికల్లా అభివృద్ధి పనులు పూర్తవ్వాలి

సాలూరు: వచ్చే ఏడాది జనవరి చివరినాటికి మున్సిపాలిటీలో దాదాపు అభివృద్ధి పనులన్నీ పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలోని తన స్వగృహంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ సూరినాయుడుతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీలో మంజూరైన పనులు, వాటి ప్రగతిపై ఆరా తీశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గడపగడపకు మనప్రభుత్వం, 15 వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్‌తో చేపడుతున్న అభివృద్ధి పనులు వచ్చే ఏడాది జనవరి చివరి నాటికి పూర్తయ్యేలా చూడాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే ఎంబుక్ రికార్డ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లోను ప్రజా ఆశీర్వాదంతో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి కొనసాగి జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్ర ప్రజలున్నారని తెలిపారు.

పరీక్షిత్‌రాజు పరామర్శ


కురుపాం: రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు


రవి మాస్టారు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి గ్రామానికి చెందిన రౌతు రవికుమార్ మాస్టారు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం పరామర్శించారు. రవి మాస్టారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మరడాన కిశోర్, వాన నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

- కురుపాం: గుమ్మలక్ష్మీపురం మండలం బుడ్డెంఖర్జ గ్రామానికి చెందిన గూడేపు రాజశేఖర్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రువర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం పరామర్శించారు. రాజశేఖర్ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, గ్రీవెన్స్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, మైనార్టీ సెల్ నాయకులు షేక్ నూరెళ్ల, ఆకుల శ్రీధర్, కిమిడి శేఖర్ ఉన్నారు.

ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలి

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు కమిటీలు వేసిన టీమ్‌ల ద్వారా నిర్దేశించిన క్రీడలను మైదానాల్లో ఆడించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యా యుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో వంలంటీర్ల సహకారంతో క్రీడలను క్షేత్రస్థాయిలో యువతీ యువకులతో ఆడించడానికి టీమ్‌లు వేసినట్లు తెలిపారు. మంగళవారం నుంచి క్రీడలు ప్రారంభమతుతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులందరూ క్రీడలపట్ల ఆశక్తి కలిగిన వారందరినీ భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు.

వాహనదారులకు తప్పని కష్టాలు

భామిని:

వంశధార ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన వరద కాలువల వంతెనలపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వంతెనల ముందు గోతులేర్పడినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్ర సమీపంలోని ఏబీ రోడ్డుపై గల వంశధార వంతెనల పరిస్థితి దారుణంగా తయారైంది. అనంతగిరి వంతెనపై అప్రోచ్ దిగబడి మూడు నెలలవుతున్నా ఇంతవరకు కాంక్రీట్ కూడా వేయలేదు. కేవలం మట్టితో పూడ్చి చేతులు దులుపుకున్నారు. బ్రిడ్జిపై కాంక్రీట్‌లు ఊడి గోతులుగా ఏర్పడడంతో రాకపోకలు కష్టంగా మారాయి. అలాగే బిల్లుమడ, పసుకుడి, సతివాడ, కొరమ వద్ద వరద కాలువలపై వంతెనల అప్రోచ్‌లు గోతులుగా మారాయి. వంశధార ప్రాజెక్ట్ ఇంజినీర్లు కనీసం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


వంశధార వంతెనపై గోతులు

వేణుగోపాలునికి తిరువీధి

సీతానగరం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోవింద మాలాధారణ చేసిన భక్తులు ఆదివారం నగరసంకీర్తనలతో మేల్కొలుపు చేశారు. ఈ మేరకు గోవింద మాలాధారణ చేసిన భక్తులు స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారిని ఆలయ అర్చకులుతో కలిసి పల్లకిలో అధిష్టించి తిరువీధి చేస్తూ నగర సంకీర్తన చేశారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు ముందుగా సువర్ణముఖి నదిలో స్నానాలు చేసుకుని వేణుగోపాలస్వామిని దర్శించి ఆలయ ప్రాంగణంలో పయనమై మార్కెట్ మీదుగా హనుమాన్ జంక్షన్ వరకూ గోవిందనామాలతో మేల్కొలుపు, నగర సంకీర్తనలతో తిరువీధి చేస్తూ తిరిగి వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకున్నట్లు చెప్పారు.


వేణుగోపాలునికి తిరువీధి చేస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు, భక్తులు

పేదలను ఆదుకోవడమే జగనన్న లక్ష్యం

భామిని: పేద ప్రజలను ఆదుకోవడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని కోసలి గ్రామానికి చెందిన కరణం చిన్నమ్మడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్య చికిత్స కోసం ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 80 వేల చెక్కును విక్రాంత్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి భర్త కాంతారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, బోడ్డేపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలి భర్త కాంతారావుకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ విక్రాంత్, పార్టీ నాయకులు

దుర్గమ్మ దేవస్థానంలో భక్తుల సందడి

పాలకొండ రూరల్: కోటదుర్గమ్మ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే దుర్గమ్మ దర్శనానికి భక్తులు బారులుతీరారు. ఘటాలు, ముర్రాటలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ర్యాలీ ప్రారంబిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ: ప్రభుత్వం కల్పించిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఆదివారం అవగాహన ర్యాలీ, 2కె రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి


బొమ్మ ట్రైన్‌లో చిన్నారులు


స్కై సైక్లింగ్ చేస్తున్న పర్యాటకులు

సీతంపేట: మండల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకులు ఆదివారం సండడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో మెట్టుగూడ జలపాతం, అడ్వంచర్ పార్కు కళకళలాడాయి. జలవిహార్‌లో పర్యాటకులు బోటుషికారు చేశారు. అలాగే స్కై సైక్లింగ్ చేశారు. బొమ్మ ట్రైన్‌లతో చిన్నారులు సందడి చేశారు.